🌐 : www.aknu.edu.in
✉ : nannayavani@aknu.edu.in
▶ : nannayanewstv
f : Adikavi Nannaya University
☎ : 9701293231

విశ్వవిద్యాలయ స్థాయి తొలి తెలుగు వార పత్రిక

# నన్నయ వాణి

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

గౌరవ సంపాదకులు
ఆచార్య మొక్కా జగన్నాథరావు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య తుపాకుల అశోక్
కుల సచివులు

సంపాదకులు
డా.తలారి వాసు, సహాయాచార్య, తెలుగు శాఖ
పువ్వుల ఆనంద్, ప్రజా సంబంధాల అధికారి, కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 6 | 07-11-2022 | పుటలు : 4


## అమరజీవి త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలి



పొట్టిశ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న వీసీ

అమరజీవి పొట్టిశ్రీరాములు త్యాగాలను ఆదర్శంగా తీసుకొని సమాజ హితం కోసం పని చేయాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. యూనివర్సిటీ ఐ.క్యూ.ఎ.సి. కార్యాలయంలో పొట్టిశ్రీరాములు చిత్రపటానికి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగాలను ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పొట్టి శ్రీరాములు 1930లో ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారని, తర్వాత మళ్ళీ 1941-1942 సంవత్సరాల్లో సత్యాగ్రహాలు, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొనడం వల్ల మూడుసార్లు జైలుశిక్ష అనుభవించారని చెప్పారు. శ్రీరాములు వంటి కార్యదీక్షాపరులు పదిమంది ఉంటే ఒక్క సంవత్సరంలోనే స్వతంత్రం సాధించవచ్చునని గాంధీజీ చెప్పిన మాటలను వీసీ గుర్తుచేసారు. ప్రతీ ఒక్కరూ తమ విధిని త్రికరణశుద్ధిగా నిర్వహించాలని, సమాజహితంగా జీవించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య పి.సురేష్ వర్మ, డా.కె.వి.స్వామి, డా.కె.సుబ్బారావు, డా.ఎం.గోపాలకృష్ణ, డా.మురళి, ఎస్.లింగారెడ్డి, జి.చంద్రకళ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## అనూరా లోగోను ఆవిష్కరించిన వీసీ




అనూరా లోగోను ఆవిష్కరిస్తున్న వీసీ జగన్నాథరావు

ఆదికవి నన్నయ యూనివర్సిటీ రాజమహేంద్రవరం అలుమ్ని అసోసియేషన్ (ANURAA) లోగోను వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు అనూరా లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ "అనూరా" ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థుల సంఘం విశ్వవిద్యాలయ అభివృద్ధిలో కీలక పాత్రను పోషించాలని అన్నారు. విజ్ఞానానికి కేంద్రాలు విశ్వవిద్యాలయాలని, మెరుగైన సమాజాభివృద్ధికి విశ్వవిద్యాలయాలు కృషి చేస్తున్నాయని తెలిపారు. ఇటువంటి విశ్వవిద్యాలయాల ప్రగతిలో అలుమ్నిల పాత్ర ఎంతో ప్రత్యేకమైనదని అన్నారు. విశ్వవిద్యాలయానికి బలమైన సాధనంగా అలుమ్ని ఉండాలని, అన్ని విధాల నన్నయ ప్రగతికి సహకరించాలని చెప్పారు. విశ్వవిద్యాలయ నాక్ గుర్తింపు ప్రక్రియలో అనూరా భాగస్వామ్యం కావాలన్నారు. సూర్యునికి రథసారథి అయిన అనూరుడు ఎటువంటివాడో విశ్వవిద్యాలయానికి అలుమ్ని అటువంటి పాత్రను పోషించాలని అన్నారు. అనూరా ప్రెసిడెంట్ గాదె కిషోర్ మాట్లాడుతూ వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు సహకారంతో విశ్వవిద్యాలయంలో అనూరా అసోసియేషన్ ప్రారంభించామని అన్నారు. వీసీ సూచనలను పాటిస్తూ విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహకరిస్తామని తెలిపారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని కళాశాలల పూర్వ విద్యార్థులు అనూరా విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థుల సంఘములో భాగస్వాములన్నారు. నవంబర్ 24వ తేదీన అనూరా దినోత్సవాన్ని విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తామన్నారు. అనంతరం వీసీ జగన్నాథరావు, రిజిస్ట్రార్ టి.అశోక్, లోగో రూపకర్త వై.పద్మజ లను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అనూరా ప్రెసిడెంట్ గాదె కిషోర్, వైస్ ప్రెసిడెంట్ డా.ఎం.కమలకుమారి, సెక్రటరీ ఎస్.నాగేంద్రకిషోర్, డైరెక్టర్స్ డా.డి.జ్యోతిర్మయి, పి.ఆనంద్, పి.ఎస్.వి.డి.గాయత్రి, ట్రెజరర్ డా.ఎం.శ్రీరామరాజు, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య కె.రమణేశ్వరి, డా.వి.పెర్సిస్, డా.కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

## మల్టీ డిసిప్లీనరీ రిసెర్చ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన వీసీ




పుస్తకాలను ఆవిష్కరించిన వీసీ జగన్నాథరావు

రిసెంట్ ట్రెండ్స్ ఇన్ మల్టీడిసిప్లీనరీ రిసెర్చ్ వాల్యూ1, 2 పుస్తకాలను ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు ఆవిష్కరించారు. యూనివర్సిటీ సెమినార్ హాల్ లో జరిగిన కార్యక్రమంలో పుస్తకాలను ఆవిష్కరించిన వీసీ వివరాలను తెలియజేసారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ లోని మేనేజ్మెంట్ విభాగాధ్యాపకులుగా పని చేస్తున్న డా.మాగంటి శ్రీదేవి, డా.ఇ.అప్పారావు లు ఎడిటర్స్ గా తీసుకువచ్చిన రిసెంట్ ట్రెండ్స్ ఇన్ మల్టీడిసిప్లీనరీ రిసెర్చ్ గ్రంథం 1, 2 భాగాలను ఆవిష్కరించామని చెప్పారు. రిసెంట్ ట్రెండ్స్ ఇన్ మల్టీడిసిప్లీనరీ రిసెర్చ్ పేరుతో అంతర్జాతీయ ప్రచురణలను ఆహ్వానించి నిష్ణాతులైన ఆచార్యులతో స్క్రూటినీ చేయించి, ఐ.ఎస్.బి.ఎన్ నెంబర్ తో ప్రచురించారని తెలిపారు. లైఫ్ సైన్సెస్, ఇంజనీరింగ్, మేనేజ్మెంట్ వంటి వివిధ విభాగాలకు చెందిన 43 ఛాప్టర్స్ తో, 2 వాల్యూమ్స్ గా ఈ పుస్తకాలను ప్రచురించారన్నారు. శ్రీ పబ్లిషింగ్ హౌస్ విశాఖపట్నం ద్వారా ప్రచురించారని తెలిపారు. అంతర్జాతీయంగా వివిధ అంశాలపై పరిశోధన పత్రాలను సేకరించి రిసెంట్ ట్రెండ్స్ ఇన్ మల్టీడిసిప్లీనరీ రిసెర్చ్ పేరుతో చక్కని పుస్తకాలను తీసుకువచ్చిన డా.ఎం.శ్రీదేవి, డా.ఇ.అప్పారావు లను వీసీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విశ్వవిద్యాలయ అధికారులు ఆచార్య పి.సురేష్ వర్మ, ఆచార్య ఎస్.టేకి, డా.ఎం.కమలకుమారి, డా.కె.స్వామి, డా.పి.విజయనిర్మల పాల్గొన్నారు.

### మంచి మాట

జీవశ్చవంలా పడి ఉండకండి. కాలయాపన పనికి రాదు. శ్రమించడం మొదలుపెడితే అనంతశక్తి మీలో జాగృతమవుతున్నట్లు మీకు అనుభూతి కలుగుతుంది.

*Now strengthen the witnessing part and do not waste time in restraining your wanderings. The mind must think; but slowly and gradually.*



– స్వామి వివేకానంద

## సంపాదకీయం



# యువతరం - నవతరం

మనదేశానికి ఇనుప కండరాలు, ఉక్కునరాలు కలిగిన యువత కావాలని అన్నారు విశ్వజనీన యోగీంద్రులైన స్వామి వివేకానందులు. శారీరక పుష్టికి, మానసిక ప్రశాంతతకు, బుద్ధి వికాసానికి, ఆత్మానందానికి, ఒక్క మాటలో చెప్పాలంటే సర్వాంగీణ వికాసానికి విద్యార్థి నిరంతర ప్రయత్నం చేయాల్సిందే.

యువత పైనే దేశ భవిష్యత్తు, ఉన్నతి, ప్రగతి ఆధారపడి ఉంది. అది విద్యాలయాలలోనే నిర్మాణమవుతుంది. రేపటి పౌరుల జీవిత చైతన్యోదయం కోసం నేటి యువత జ్ఞానోదయం వైపు పురోగమించాలి. నవతరం నిర్మాణమంతా యువతరంతోనే మొదలవుతుంది.

హృదయంలో ఉరకలు వేసే దేశభక్తి, ఉత్సాహమున్న విద్యార్థులు ఇవాళ సమాజానికి ఎంతో అవసరం. మనిషి శారీరకంగా, మానసికంగా, వైజ్ఞానికంగా ఎదగటాన్నే ఉన్నతి అని అంటాం. నేటి విద్యార్థులు రేపటి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలంటే ఒక సమగ్రమైన ప్రణాళిక అవసరమవుతుంది. శారీరక, మానసిక,సాంస్కృతిక, విద్యా విషయాలలో యువతరం సరైన నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని సముపార్జించుకుంటూ శీల సంపదను సంతరించుకోగలగాలి.

మారుతున్న కాలంలో యువతరం ప్రవర్తనా రీతికి మార్గదర్శకమైన చైతన్యం కావాలి. ఆచరణీయమైన సూత్ర భావసంపద కావాలి. యువత అటు గ్రామీణ, ఇటు పట్టణ సంస్కృతులను, ప్రాచీన నవీన విజ్ఞానాలను ఆకళింపు చేసుకోవాలి. వాటిని గౌరవించాలి.

వ్యక్తిత్వ వికాసానికి సత్సంగం చాలా అవసరం. ఆచార వ్యవహారాల్లో, ఆలోచనల్లో తమకన్నా శ్రేష్టులైన వారి చెంతన చేరటమే సత్సంగమంటే. అటువంటి సజ్జన సాంగత్యం వల్ల ప్రతి మనిషిలో సద్గుణాలు ప్రవేశిస్తాయి. అంతేకాదు జాగృతమవుతాయి కూడా. యువత తమనుతాము రక్షించుకోవటానికి సజ్జన సాంగత్యం ఎంతో అవసరం. మంచి మనుషుల సాంగత్యంవల్ల మనిషిలోని బాహ్యమైన సద్గుణాలు అభివృద్ధి చెందుతాయి. అంతశ్శుద్ధికి ఆత్మ పరిశీలన చాలా అవసరం. మనిషి ఏకాంతంలో ప్రశాంతంగా తన గురించి తాను ఒకసారి ఆలోచించుకోవాలి. గుణదోషాలు, మంచిచెడుల పరిశీలన వలన తనను తాను తెలుసుకొని తన ప్రయాణం ఎటో నిర్ణయించుకుంటాడు.

జ్ఞానపీఠ పురస్కారగ్రహీత సి. నారాయణరెడ్డి గారు విశ్వంభర కావ్యంలో 'నాకు తెలిసిందొక్కటే! నాకేమీ తెలియదని' అంటారు తెలియదనే విషయాన్ని తెలుసుకుంటే తెలుసుకోవడానికి ప్రయత్నం జరుగుతుందనేది ఆ వాక్య సారాంశం. అరిస్టాటిల్ స్కూల్ గ్రీకుడెల్ఫీ భవనంపై *Know Thy Self* అని రాసి ఉంటుంది. 'నిన్ను నీవు తెలుసుకో!' అని. మనను మనం తెలుసుకోవడం చాలా అవసరం.

యువతరం నవతరం నిర్మాణానికి, వ్యక్తిత్వ వికాసానికి సన్మార్గగాములై పయనించి శక్తిమంతులుగా, శీలవంతులుగా ఎదగాలన్నది ముఖ్యమైన అంశం. ఆ దిశగా ప్రయాణిస్తారని ఆకాంక్ష!!

# శానిటైజర్ తయారుచేసిన నన్నయ ఫార్మసి విద్యార్థులు

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ఫార్మాస్యూటికల్ సైన్సెస్ విద్యార్థులు సువాసనభరితమైన శానిటైజర్ ను తయారు చేసారు. రాజమహేంద్రవరం ప్రాంగణంలో వీసీ ఆచార్య మొక్కా జగన్నాథరావు ఫార్మసి విద్యార్థులు చేసిన శానిటైజర్ ను పరిశీలించి విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వీసీ వివరాలను తెలియజేసారు. నన్నయ యూనివర్సిటీ తాడేపల్లిగూడెం ఫార్మస్యూటికల్ సైన్సెస్, స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ కె.కులదీపక్ వినయ్, కో.చైర్మన్ కె.రాజు మరియు క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో సువాసన భరితమైన శానిటైజర్ రూపొందించారని అభినందించారు. వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ఫార్ములా మూలఆధారంతో పాటు మరికొన్ని ఫార్ములాలను ఉపయోగించి సువాసనభరితంగా శానిటేజర్ లను తయారు చేసారన్నారు. చర్మంపై ఎటువంటి హానికరమైన ప్రభావం లేదని ధృవికరిస్తూ పిహెచ్ వంటి వివిధ రకాల టెస్ట్ ను నిర్వహించారని చెప్పారు. ఆయా పరీక్షలలో మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. త్వరలో విశ్వవిద్యాలయ ప్రాంగణాలను నాక్ పీర్ టీమ్ సందర్శించనున్న నేపథ్యంలో ఫార్మసి విభాగంలోని బెస్ట్ ప్రాక్టీసెస్ గా విద్యార్థులు తయారుచేసిన శానిటైజర్ ను ప్రదర్శించాలన్నారు. అలాగే



విద్యార్థులు తయారు చేసిన శానిటైజర్ ను పరిశీలిస్తున్న వీసీ




శీతాకాలంలో ఉపయోగించే క్రీములు, లిప్ బామ్ లను తయారు చేసారని చెప్పారు. ఫైటో ఫార్మసుటికల్ టెక్నాలజీతో నూతన ఔషధాలను తయారు చేయడంలో విభాగ అధ్యాపకులు, విద్యార్థులు, క్లబ్ సభ్యులు కృషి చేయాలన్నారు. నూతన ఆవిష్కరణలకు ప్రయత్నిస్తున్న విద్యార్థులకు సహకరిస్తున్న ప్రాంగణ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీరమేష్ ను వీసీ అభినందించారు. అలాగే కోర్సు కోఆర్డినేటర్ డా.బట్టుహీరా, డా.సురేంద్రబాబు, కె.నిత్యానందరెడ్డి, పి.అరుణ, విద్యార్థులకు మరికొన్ని సూచనలనందజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్, విద్యార్థులు పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**31.10.22 (మీడియాసెల్)** విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య మొక్కా జగన్నాథరావు అన్నారు. సోమవారం వీసీ రంపచోడవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు వీసీకి ఘనస్వాగతం పలికారు. కళాశాలను పరిశీలించిన వీసీ కళాశాల ప్రాంగణంలో మొక్కను నాటారు. ప్రిన్సిపాల్ కార్యాలయంలో అధ్యాపకులతో మాట్లాడి కళాశాల విద్యాప్రగతిపై ఆరాతీసారు. తరువాత వీసీ జగన్నాథరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మూరుమూల ఏజెన్సీ ప్రాంతాలలోని ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థుల సంఖ్య మరింత పెరగాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలోని రంపచోడవరం డిగ్రీ కళాశాలలో చక్కని వసతులతో ఉన్నత విద్య అందుతుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు కృషి, పట్టుదల, క్రమశిక్షణలతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని, తద్వారా గిరిజనుల జీవనాభివృద్ధి పెంపొందుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని, వాటి ఫలాలను విద్యార్థులు అందుకోవాలని చెప్పారు. పేదరికం, వెనుకబాటుతనం, సామాజిక సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు వంటి సర్వసమస్యలు విద్యతోనే జయించగలమని అన్నారు. గిరిజనులు ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం వీసీ జగన్నాథరావును ప్రిన్సిపల్ డా.వి.శ్రీనివాసరావు, వైస్.ప్రిన్సిపల్ డి.రవికుమార్ మరియు అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించి జ్ఞాపికను అందించి అభినందించారు.



వీసీ జగన్నాథరావును సన్మానిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

# ఉపకులపతి ఉవాచ



అందరి సమష్టి కృషి ఫలితంగా మనం విశ్వవిద్యాలయానికి ఇప్పటికే *ISO*, *AICTE* సాధించుకున్నాం. ఇప్పుడు *NAAC* గ్రేడింగ్ సాధనలో ఉన్నాం. ప్రతి విభాగం, కార్యాలయం తాము చేస్తున్న కృషిని, సాధనలను, విద్యార్థి విజయాలను న్యాక్ పీర్ టీమ్‌కి తెలియజేయడానికి సన్నద్ధం కావలసిందిగా కోరుతున్నాను.ప్రతి విషయంలో అవగాహనను కలిగి పీర్ టీమ్ అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉండాలి. *NAAC* గ్రేడ్ విశ్వవిద్యాలయాభివృద్ధికి ఎంతో దోహదం చేస్తుంది. రాబోయే రోజుల్లో ఈ గుర్తింపులు విశ్వవిద్యాలయానికి, విద్యార్థులకు ఎంతో ప్రయోజనాన్ని కలిగిస్తాయి.

నిరంతర పరిశ్రమ, సాధనలే అభివృద్ధికి సోపానాలు. అమలు చేయడానికి సిద్ధంగా ఉన్న ప్రతి ఆలోచనా శక్తివంతమైందే. మన అందరి ఆలోచనలు కలిసి ఆచరణలోకి రావడమే విశ్వవిద్యాలయ అభివృద్ధి. రేపటి పరిపక్వతని ఈరోజు విద్యార్థులకు అందించగలిగితే గొప్ప భవిష్యత్తు వారికి స్వాగతం పలుకుతుంది. విద్యా వ్యవస్థలో ఇదే మనం చేయగలిగిన పని.

– ఆచార్య మొక్కా జగన్నాథరావు

# గూడెం అధ్యాపకులను అభినందించిన వీసీ

ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ తాడేపల్లిగూడెం నందు కెమిస్ట్రీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. చాట్ల నాగబాబు మరియు ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.కె.వి.ఎస్.ఎన్.రాజు ఈ విద్యాసంవత్సరము పరిశోధనలో చేసిన కృషికు గాను ఇంటర్నేషనల్ జర్నల్ ఫర్ మోడ్రన్ ట్రెండ్స్ ఇన్ సైన్స్ అండ్ టెక్నాలజీ నుండి ఎక్సెలెన్స్ ఇన్ రీసెర్చ్ అవార్డు అందుకున్నారు. కెమిస్ట్రీ విభాగంలో డా.నాగబాబు IITH నుండి Ph.D మరియు జర్మనీలో గల Ruhr యూనివర్సిటీ లో పోస్టుడాక్టోరల్ పరిశోధకునిగా అనుభవం కలిగి వున్నారు, రీసెర్చ్ లో భాగంగా Jenesys 2.0-Japan, CRSI-NCL Pune, MKU- Tamilnadu, IITH వంటి సంస్థల నుండి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు





అందుకున్నారు మరియు ఇప్పటివరకు 18 ఆర్టికల్స్ ప్రచురించబడ్డాయి. ఫిజిక్స్ విభాగం నుండి డా.కె.వి.ఎస్.ఎన్.రాజు కె.ఎల్.యూనివర్సిటీ నుండి పిహెచ్.డి అందుకున్నారు . ఇప్పటివరకు ఫిజిక్స్ విభాగం నుండి 10 రీసెర్చ్ ఆర్టికల్స్ ప్రచురించబడ్డాయి మరియు ఈ విద్యాసంవత్సరము (2022) లో ఒక పేటెంట్ కలిగి వున్నారు. ఈ సందర్భంగా ఆదికవి నన్నయ వైస్ ఛాన్సలర్ ఆచార్య మొక్కా జగన్నాథరావు వీరిరువుని అభినందించి, వీరు ఇంకా ఉన్నతశిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ క్యాంపస్ తాడేపల్లిగూడెం ప్రిన్సిపాల్ ఆచార్య కొట్టి శ్రీరమేష్ వీరిరువుని అభినందించి శుభాకాంక్షలు తెలియచేసారు.




# నదీ ప్రస్థానం

ప్రతులకు:
వెల:200
9440798301




**నది అంటే నీరు మాత్రమే కాదు. నది అంటే ఒక జీవన విధానం.**

You know my name not my story అన్నట్లు మనకు చాలా వరకు నదుల పేర్లు తెలుసు కానీ వాటి చరిత్ర ,ప్రవాహ ప్రయాణం వంటి వివరాలు అందరికీ తెలియవు. చంపావతి నది ఒడ్డున పెరిగిన రామవరపు వెంకట రమణ మూర్తి గారి చిన్న నదుల గురించి తెలుసుకోవాలన్న నాటి జిజ్ఞాస కు అక్షర రూపమే ఈ "నదీ ప్రస్థానం"

ప్రతీ నదికి గమ్యం సముద్రమే కానీ నదీ గమనం వేరు వేరుగా ఉంటుంది.నదులు మానవ వాసానికి, మానవ వికాసానికి ఆవాసాలు .మనిషి తినే తిండి లో,అతని భాషలో, అతని ప్రగతి లో,ఆధునిక నాగరిక భావాలను పెంపొందించడంలో నదీతీరాల ప్రభావం ఉంటుందనేది నిర్వివాదాంశమని రచయిత అభిప్రాయం. ఈ పుస్తకం లో 25 నదుల గురించి వాటి జన్మస్థలం ,పరివాహక ప్రాంతాలు, పురాణ ప్రాశస్త్యం, చారిత్రక ప్రాముఖ్యం, ఏ రాజ్య పాలకుల ఏలుబడికి సాక్ష్యంగా నిలచిందో, ఏ ఉపనదులను కలుపుకుంటూ తన ప్రయాణం సాగించిందో, ఏ ఏ కవిశ్రేష్టుల కావ్యాలకు ప్రేరణగా నిలిచిందో, వాటి మీద ఏ ఏ శాస్త్రవేత్తలు పరిశోధన చేశారో.. మొదలైన అనేక విషయాలు ఎంతో కృషితో సేకరించి మనకు వివరంగా ఇందులో పొందుపరిచారు.

కర్ణాటకలోని రాయపాడు కొండల్లో జన్మించిన చెయ్యేరు–బాహుదా నదుల సాంస్కృతిక వారసత్వాన్ని, చారిత్రక నేపథ్యం, తుందభద్రనది గురించి 'నదీ తారతమ్య స్తోత్రమ్'లో శ్రీ రాఘవేంద్రస్వామి కీర్తించారని ,రామాయణ కాలంలో పంపానది 1గా పిలువబడేదని, ఎంతో విశిష్టత కలిగిన హంపి,కంపలి,ఆనేగొంది, రాజోలి సంస్థానాలు ఈ నదీ ప్రాంతానివని అలాగే ఈ నది పై ఉన్న ఆనకట్టల గురించి, జలవిద్యుత్ కేంద్రాలు, పరిశ్రమల గురించి మనకు తెలుస్తుంది. పేన్నానది, సబర్మతి పరివాహక ప్రాంతాల్లో ఆనాడు జరిగిన స్వాతంత్ర్య సమర ఘట్టలగురించి, చంపావతి నది తీరానికి సంబందించిన ప్రముఖుల గురించి, నదీ పరివాహక ప్రాంత విశేషాల గురించి పాఠకులు తెలుసుకుంటారు.

'ప్రణవ ప్రయాగ ' అనే వ్యాసం లో ప్రయాగ ,త్రివేణి సంగమానికి సంబందించిన విషయాలను, పుష్కర సమయంలో అక్కడ జరిగే కుంభమేళా ను ప్రత్యక్షంగా అధ్యయనం చేయడానికి వచ్చిన ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం నుంచి అధ్యయన బృందం వచ్చిందన్న అనేక విశేషాలు మనకు ఈ నది గొప్పదనాన్ని చాటిచెబుతాయి.

మత్స్య, పద్మ, కూర్మ, స్కాంద పురాణంలో చాలాచోట్ల వర్ణింపబడిన 800 మైళ్ల దీర్ఘ ప్రయాణం చేసే జలనిది 'నర్మద నది ' గురించి అక్కడ తమ ప్రాభవాన్ని చాటిన సామ్రాజ్యాల గురించి, సాహిత్యం గురించి మనకు విపులంగా చర్చించారు రచయిత. 'ఒక చిన్న నది పెద్దకథ ' అనే వ్యాసంలో చిత్రావతి నది గురించి దానికి సంబందించిన పెనుగొండ, పుట్టపర్తి విశిష్టతను గురించి, ఆ పరిసర ప్రాంత జానపద కళారూపాలైన తోలుబొమ్మలాట చెంచునాటకాలు, జోగప్పలు మొదలైన వాటి గురించి అనేక విషయాలు మనం తెలుసుకోవచ్చు.

ఎన్నో రాజ్యపాలనలకు, యుద్ధాలకు, దండయాత్రలకు సాక్షిగా నిలచి ఎంతో పురాణ చారిత్రక వైభవం కలిగి తాజ్మహల్, ఆగ్రకోటలాంటి ఎన్నో ప్రపంచ విఖ్యాతి గాంచిన సందర్శనా క్షేత్రాలు కలిగిన యమునా నది గురించి చాలా విషయాలు మనకు తెలుస్తాయి.

శారద నది జన్మస్థానమైన అనంతగిరి సందర్శకుల పాలిట స్వర్గ సీమ అని క్రీ.శ 14 వ శాబ్దానికి చెందిన శాసనాలలో పేర్కొనబడిన ఆనాటి కసిమికోట నేటి కశింకోట ఈ నదీ తీరం దేనని మనుకర్థమవుతుంది.

ఇంక గోస్తని, పినాకిని, కృష్ణ, గుడ్లకమ్మ, మూసి నది, మంజీర, స్వర్ణముఖి, నాగావళి, వంశధార నదుల గురించి ఎన్నో ఆశ్చర్యకరమైన విశేషాలను మనకు చాలా వివరంగా రచయిత అక్షరబద్ధం చేసారు.

నీరు మనిషిని మనస్సుని శుద్ధి చేస్తుంది. ఈ 'నదీ ప్రస్థానం' వ్యాస సంపుటి మనకి తెలియని ఎన్నో విషయాలను తెలియచేయడంతో పాటు మన జీవితం లో కలిసివచ్చేవాటిని కలిసిరాని వాటిని నది మలుపుల గా భావిస్తూ, బిందువు సిందువు చేరి సిందువుగా మారినట్లు ఈ జీవాత్మ పరమాత్మ లో కలిసే వరకు సాగించే ప్రతీ వ్యక్తి జీవన ప్రయాణమూ ఒక నదీ ప్రస్థానమే అనే సరిక్రొత్త దృకోణం కలిగిస్తుంది.


సమీక్ష: డా.సిహెచ్.కృష్ణ భవాని
సైకాలజీ విభాగం.అనూర్.

# కాకినాడ క్యాంపస్ లో విజిలెన్స్ అవేర్నెస్




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎం.ఎస్.ఎన్ క్యాంపస్ కాకినాడ నందు డిపార్ట్మెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ మరియు ఓ.ఎన్.జి.సి సంయుక్తంగా నిర్వహించిన విజిలెన్స్ అవేర్నెస్ వీక్ అనే ప్రోగ్రాంలో భాగంగా కరప్షన్ ఫ్రీ ఇండియా ఫర్ డెవలప్మెంట్ అనే అంశంతో క్యాంపస్ లోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం మరియు నినాద రచన వంటి పోటీ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా క్యాంపస్ ప్రిన్సిపల్ డా.ఎం.కమలకుమారి మాట్లాడుతూ అవినీతి రహిత సమాజం ఏర్పాటులో విద్యార్థుల పాత్ర ముఖ్యమైనదని భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇంకా అభివృద్ధి చెందుతూ ఉన్న దశలోనే ఉండడం అనేది నిజంగా ఆలోచించవలసిన విషయం అని విద్యార్థులు ఈ దశ నుండే అవినీతి రహిత సమాజం పట్ల అవగాహన కలిగి ఉండి తమ చుట్టూ ఉన్న వారిని కూడా ప్రేరేపితం చేయవలసిందిగా, పేర్కొన్నారు. అవినీతి నిర్మూలన ప్రతిజ్ఞని విద్యార్థులు సిబ్బంది చేత నిర్వహించారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఓఎన్జిసి చీఫ్ హెచ్ఆర్ అండ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డి. మాలిక్ మాట్లాడుతూ అవినీతికి అత్యాశ కేంద్ర బిందువు అని దాన్ని మార్చి సమాజాన్ని సరైన దారిలో నడిపించేది విద్యార్థులని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఓఎన్జిసి విజిలెన్స్ ఆఫీసర్ కె. విజయరాజు ప్రొఫెసర్ ఎస్.ప్రశాంతిశ్రీ, ప్రోగ్రామ్ కన్వీనర్ డా.అజయరత్నం, అప్పారావు, రామరాజు, శ్రీదేవి, అనిలంబిక, మనోజ్, మణికంఠ, రజిత, బోధన బోధనేతర సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీలో గెలిచిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు.

# నన్నయలో పటేల్ జయంతి


పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్

విశ్వవిద్యాలయంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులు, ఉప ప్రధాని భారతరత్న సర్దార్ వల్లబాయ్ పటేల్ దేశాభివృద్ధికి విశేష సేవలు అందించారని అన్నారు. స్వాతంత్ర్యమొచ్చిన అనంతరం భారతదేశంలో విడిగా పరిపాలన కొనసాగిస్తున్న 562 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, దేశ ఐక్యతకు ఎనలేని కృషి చేసిన భారత ఉప ప్రధాని సర్దార్ వల్లబాయ్ పటేల్ వీరత్వాన్ని కొనియాడారు. సర్దార్ వల్లబాయ్ పటేల్ ధైర్య సహసాలు, పట్టుదలను యువత ఆదర్శంగా తీసుకోవాన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు డా.కె.వి.స్వామి, డా.కె.సుబ్బారావు, డా.ఎన్.ఉదయభాస్కర్, డా.ఎం.గోపాలకృష్ణ, ఎస్.లింగారెడ్డి, జి.చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

# అత్యున్నత స్థానం




ఒక్కొక్కరికి ఒక్కొక్క రంగంలో ప్రావీణ్యం ఉంటుంది.
అప్పటికే ఆ రంగంలో ప్రావీణ్యం, ప్రతిష్టలు పొందిన వ్యక్తులు ఎందరో ఉండవచ్చు.
ఓ యువ చిత్రకారుడు ఉన్నాడనుకుందాం.అప్పటికే దేశంలో ప్రతిష్టపొందిన ఎం.ఎఫ్ హుస్సేన్ లు ఉండవచ్చు. ఒక క్రికెటర్ ఉన్నాడనుకుందాం.అప్పటికే సచిన్,కోహ్లీ లు ఉండవచ్చు.
ఓ కవికి శ్రీశ్రీ, సినారేలు కనిపించవచ్చు.
ప్రతి రంగంలోనూ ఎంతో మంది ప్రముఖులు ఉంటారు.
అప్పటికే లబ్ద ప్రతిష్టులై ఉంటారు.
పర్వాలేదు.ఎందరున్నా పర్వాలేదు.
ఎవరి స్థానం వారిదే.
మనం చాలామంది దృష్టిని ఆకర్షించకపోవచ్చు.
కానీ..మన ప్రయత్నములో
ఒక ఆనందం ఉంటుంది.
అందుకని మన ప్రయత్నం మనం చేయాల్సిందే.
మన లక్ష్యం వైపు మన ప్రయాణం
సాగించాల్సిందే.
మనం లక్ష్యాన్ని చేరుకుంటామా లేదా అనేది
మరో విషయం.
కానీ మనం లక్ష్యం చేరుకోవడం కోసం గట్టి
ప్రయత్నం మాత్రం చేయాలి.
పోటీ పరీక్షల్లో విజయం సాధించలేక
డీలపడవచ్చు.
అంతమాత్రాన మన ప్రయత్నం మాత్రం
ఆపకూడదు.
మనం ఎంచుకున్న రంగంలో అత్యున్నత స్థానం
పొందలేకపోవచ్చు.
కానీ...
ఆ స్థానం చేరుకోవడం కోసం గట్టి ప్రయత్నం చేశామన్న సంతృప్తి,ఆనందం మనకు జీవితాంతం ఉండిపోతుంది.
ఏమీ చేయకుండా ఉండిపోవడం కంటే ప్రయత్నం చేసి ఓడిపోవడం గొప్పే కదా!అంతకన్నా మనకు ఇంకేం కావాలి.

– బి.సుశాంత్ కుమార్



"ప్రవహించే కాలంలో
పరుగెత్తే రంగులచేప- జీవితం!
కలలవలలకు చిక్కదు
అది కన్నీళ్లగాలానికి తగలదు!"

- గుంటూరు శేషేంద్రశర్మ

ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in